క్లుప్తంగా

ఘనంగా సీతారాముల కల్యాణం



జానకీరాంపురంలో సీతారాముల కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

గొలుగొండ: జానకీరాంపురం గ్రామంలో బుధవారం సీతారాముల కళ్యాణ కార్యక్రమం ఎంతో వైభవంగా నిర్వహించారు. ఆలయం మూడో వార్షికోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమం నిర్వహించారు. ఉత్సవం లో 12 నూతన జంటలు పాల్గొన్నారు. చుట్టు పక్కల గ్రామాలైన నర్సంగబిల్లి, జోగుంపేట, గొలుగొండ, పప్పుశెట్టిపాలెం, తదితర గ్రామాలతో పాటు తూర్పుగోదావరి జిల్లా నుంచి ఆలయ దాతలు కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. కళ్యాణం అనంతరం 4వేల మంది భక్తులకు అన్నసమారాధన జరిపారు.

మండల వ్యవసాయాధికారిగా అనసూయ

మాడుగుల రూరల్: మండల వ్యవసాయాధికారిగా ఎం. అనసూయ బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న ఎం. వాసుదేవరావు సాధారణ బదిలీలో భాగంగా అల్లూరి సీతారామరాజు జిల్లా డుంబ్రిగూడ మండలానికి వెళ్లారు. నూతన ఏఓ అనసూయ అనకాపల్లి భూసార పరీక్ష కేంద్రం నుంచి బదిలీపై వచ్చారు. రైతులకు పూర్తిస్థాయిలో సేవలు అందించడానికి కృషి చేస్తానని ఆమె పేర్కొన్నారు.

ముఠా కార్మికులకు సమగ్ర చట్టం చేయాలి



హనుమంతురావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ముఠా కార్మికులు

నర్సీపట్నం: ముఠా కార్మికులకు సమగ్ర చట్టం చేయాలని ముఠా కార్మిక సంఘం(సిఐటియు) జిల్లా గౌరవ అధ్యక్షుడు రొంగల రాము అన్నారు. స్థానిక మున్సిపల్ స్టేడియం నందు బుధవారం ముఠా కార్మిక సంఘ సమావేశం జరిగింది. ముందుగా మోటూరు హనుమంతురావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనేక ఏళ్లుగా ముఠా కార్మికులు హమాలీ పనులు చేస్తూ ప్రజలకు సేవలు అందిస్తున్నారన్నారు. ముఠా కార్మికుల రక్షణకు, సంక్షేమానికి సమగ్ర చట్టం చేయాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయు నాయకులు అడిగర్ల రాజు, ఎల్.గౌరి, కె.వి.సూర్యప్రభ పాల్గొన్నారు.

వరి విత్తనాల నమోదు వేగవంతం చేయాలి

రోలుగుంట : ఖరీఫ్‌ను పురస్కరించుకొని వరి విత్తనాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ వేగవంతం చేయాలని మండల వ్యవసాయాధికారి సి.హెచ్.చిరంజీవి సిబ్బందిని ఆదేశించారు. మండల వ్యవసాయాధికారిగా బాధ్యతలు చేపట్టిన ఆయన తొలిసారిగా తన కార్యాలయంలో మండల స్థాయిలో సచివాలయాల్లో పనిచేస్తున్న గ్రామస్థాయి వ్యవసాయాధికారులతో బుధవారం సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా సచివాలయాల పరిధిలో రైతుల వివరాలు భూ విస్తీర్ణం, రైతులు కోరుతున్న విత్తనాలు, సాగవుతున్న పంటలపై చర్చించారు. రైతులు కోరిన విత్తనాలను రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయిన వెంటనే రైతులకు పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు.

చాతుర్మాస వ్రతానికి ఏర్పాట్లు


కె.కోటపాడు : కొత్తపెంటలో దేవానంద ఆశ్రమం వద్ద చాతుర్మాస మహావ్రతం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు ఆ ఆశ్రమ పీఠాధిపతి విష్ణు దేవానంద సరస్వతీ స్వామి తెలిపారు. పాచిలవానిపాలెం రామాలయంలో బుధవారం చాతుర్మాస మహావ్రతం నిర్వహణపై భక్తులకు వివరించారు. ఈ చాతుర్మాస మహావ్రతం జూలై 10 ఆషాఢ పౌర్ణమి నుంచి నవంబర్ 5 కార్తీక పౌర్ణమి వరకూ ఉంటుందన్నారు. కార్యక్రమ నిర్వహణకు భక్తుల సహకారం ఉండాలని కోరారు.

తూటిపాల పాఠశాలలో 9 మంది విద్యార్థుల చేరిక



పాఠశాలలో చేరిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

మాకవరపాలెం : మండలంలోని తూటిపాల ప్రాథమికోన్నత పాఠశాలలో ఒకేరోజు తొమ్మిది మంది విద్యార్థులు చేరారని ఎంఈవో పి.ఎస్.ఎన్.మూర్తి తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న వసతులు, సౌకర్యాలు, పథకాలపై ఉపాధ్యాయులు విస్తృతంగా ప్రచారం చేశారన్నారు. ఈ నేపథ్యంలో ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న తొమ్మిది మంది విద్యార్థులు బుధవారం చేరారన్నారు. బడిఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం భీమారావు, ఉతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



దేవరాపల్లి జగనన్న లేఔట్‌లో నిర్మాణం పూర్తయిన మౌలిక సదుపాయాలు లేక గృహం ప్రవేశం చేయని ఇళ్లు

జగనన్న కాలనీపై

కూటమి సర్కార్ శీతకన్ను

- మౌలిక సదుపాయాల కల్పనలో నిర్లక్ష్యం
- అవస్థలు పడుతున్న ఇళ్ల లబ్ధిదారులు
- అంతర్గత సీసీ రోడ్లు నిర్మించక నరకయాతన
- సదుపాయాలు లేక గృహ ప్రవేశాలకు అంతరాయం
- వీధి దీపాలు, తాగునీటి సదుపాయాలు కల్పించాలని విజ్ఞప్తి

దేవరాపల్లి : జగనన్న కాలనీల్లో అంతర్గత సీసీ రోడ్లు నిర్మించక పోవడంతో ఇళ్ల నిర్మాణదారులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. చిన్నపాటి వర్షానికే కాలనీ మొత్తం బురదమయం కావడంతో రాకపోకలకు నరకయాతన అనుభవిస్తున్నారు. విద్యుత్, తాగునీటి సదుపాయం కల్పించకపోవడంతో వారి బాధలు వర్ణాతీతం. దేవరాపల్లి మండలంలో గత ప్రభుత్వ హయాంలో 1984 ఇళ్లు మంజూరు చేశారు. వీటిలో 705 ఇళ్లు పూర్తయి గృహ నిర్మాణాలు పూర్తయ్యాయి. మండలంలోనే దేవరాపల్లి లేఔట్ అతి పెద్దది. దేవరాపల్లిలో లేఔట్‌లో 274 ఇళ్లు మంజూరు చేశారు. వీటిలో 50 ఇళ్లు వరకు స్లాబ్ పూర్తి చేసి మిగిలిన పనులను చేపడుతున్నారు. మరో 20 ఇళ్లు నిర్మాణం పనులు పూర్తయి గృహ ప్రవేశానికి సిద్ధంగా ఉన్నాయి. ఇక్కడి లేఔట్‌లో ఇళ్ల నిర్మాణాలు పూర్తయినప్పటికీ మౌలిక సదుపాయాలు లేని కారణంగా గృహ ప్రవేశం చేసుకోవడానికి అంతరాయం ఏర్పడింది.

సొంతింటి కల నెరవేర్చుకుందామని ఎదురు చూసిన లబ్ధిదారులకు నిరాశే మిగులుతుంది. కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరుతూ దేవరాపల్లిలో జగనన్న కాలనీ లబ్ధిదారులు ఎంపీడీవోకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. అయితే ఇప్పటికే పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ఇటీవల ఎంపీడీవో కార్యాలయ ఏవోకు వినతి పత్రం అందిస్తున్న జగనన్న లేఔట్ లబ్ధిదారులు



ఇంటి నిర్మాణ పనులకు పక్కింటి బాత్‌రూమ్ గొయ్యిలో వర్షపు నీటిని సేకరిస్తున్న లబ్దిదారులు

సీసీ రోడ్లు లేక బురదమయం



దేవరాపల్లి లేఔట్‌లో ఇంటి నిర్మాణం చేసుకుంటున్నాం. మోటారు దూరంగా ఉండడంతో నీటి కోసం అవస్థలు పడుతున్నాం. అంతర్గత సీసీ రోడ్లు నిర్మించక పోవడంతో చిన్నపాటి వర్షానికే బురదమయం అవుతుంది. మెటీరియల్ లోపలికి వచ్చే పరిస్థితి లేదు. అధికార్లు స్పందించి సౌకర్యాలు కల్పించాలి.

– దాసరి ఆదిలక్ష్మి, ఇంటి లబ్ధిదారు, దేవరాపల్లి

నిధులు రాగానే సదుపాయాలు



దేవరాపల్లి లేఔట్‌లో అంతర్గత సీసీ రోడ్లు, వీధి దీపాలు లేవని లబ్ధిదారులు తమ దృష్టికి తీసుకువచ్చారు. లేఔట్‌లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయగానే ప్రజలకు ఇబ్బందులు లేకుండా సదుపాయాలు కల్పిస్తాం.

– ఎం.వి.సువర్ణరాజు, ఎంపీడీవో దేవరాపల్లి

జగనన్న కాలనీ స్థలం ఆక్రమణ

బుచ్చెయ్యపేట : మండలంలో గల చిన అప్పనపాలెం గ్రామంలో జగనన్న కాలనీని ఆనుకుని ఉన్న ప్రభుత్వ స్థలం ఆక్రమణకు గురైంది. గతంలో ఇదే స్థలాన్ని కొంతమంది ఆక్రమించగా గ్రామస్తులు ఫిర్యాదు చేయడంతో అధికారులు ఆక్రమణలు తొలగించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. హెచ్చరిక బోర్డులుండగానే మళ్లీ షెడ్డు వేసి ఆక్రమించడంపై గ్రామస్తులు ఆగ్రహం చెందుతున్నారు. వెంటనే తొలగించాలంటున్నారు.



ఆక్రమణ స్థలంలో ఏర్పాటు చేసిన షెడ్డు

ధైర్యసాహసాలకు ప్రతిరూపం ఝాన్సీలక్ష్మీబాయి



ఝాన్సీలక్ష్మీ విగ్రహం వద్ద నివాళులు

నర్సీపట్నం : ధైర్యసాహసాలకు ఝాన్సీలక్ష్మీబాయి ప్రతిరూపమని వైఎస్సార్‌సీపీ టౌన్ పార్టీ అధ్యక్షుడు ఏకా శివ అన్నారు. ఆమె వర్ధంతి సందర్భంగా పెదబొడ్డేపల్లి వైఎస్సార్ ట్యాంక్‌బండ్ చెరువు వద్ద ఉన్న లక్ష్మీబాయి విగ్రహానికి పార్టీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొదటి భారత స్వాతంత్ర్య సంగ్రామంలో ప్రముఖ పాత్ర పోషించారని కొనియాడారు. ఝాన్సీలక్ష్మీబాయి భారతదేశ చరిత్రలో ఒక గొప్ప వ్యక్తిగా నిలిచిపోయారన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు తమరాన శ్రీనివాసరావు, యాదిగిరి శేషు, దాడి బుజ్జి, ఈరెల్లి నాగరాజు పాల్గొన్నారు.

కూటమి పాలనలో మహిళలపై పెచ్చుమీరిన దాడులు

చీడికాడ : రాష్ట్రంలో కూటమి పాలనలో మహిళలపై దాడులు, అఘాయిత్యాలు పెరిగిపోతున్నాయని మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు గొల్లవిల్లి రాజుబాబు అన్నారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో బుధవారం జగన్ అంటే నమ్మకం, చంద్రబాబు అంటే మోసం పుస్తకాన్ని ఆయన ఎంపీపీ కురచా జయమ్మతో కలిసి ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ 50 ఏళ్లకు వృద్ధాప్య పింఛను 18 సంవత్సరాలు దాటిన ప్రతి మహిళకు నెలకు రూ.1500 ఇస్తానని, ప్రతి రైతుకు ఏడాదికి రూ.20,000, మహిళలకు ఉచిత బస్సు, నిరుద్యోగులకు నెలకు రూ.3000 అందిస్తానని కూటమి నేతలు హామీలు గుప్పించారని, ఏ ఒక్కటీ అమలు చేయలేదన్నారు. ఈ కార్యక్రమంలో మండల యూత్ అధ్యక్షుడు స్వామినాయుడు, నాయకులు ఈర్లె చైతన్య, ఆర్మీ నాయుడు, గంటా మత్స్యరాజు, సర్పంచ్‌లు సన్యాసినాయుడు, గంగాశేషు, నాయకులు శ్రీనివాసరావు, రామ్‌కుమార్, దేవినాయుడు, కొండబాబు, ఎంపీటీసీలు నాయుడుబాబు, మాజీ సర్పంచ్‌లు అప్పారావు, స్థానిక నాయకులు మహేశ్, రామారావు, రమణ, బూడి యువసేన సభ్యులు బలరామ్, పరువాడ ప్రసాదు, శివ అయ్యబాబు పాల్గొన్నారు.



పుస్తకావిష్కరణలో పాల్గొన్న ఎంపీపీ, తదితరులు

70 మందికి ఉచిత కంటి పరీక్షలు

మాకవరపాలెం: ఉచిత కంటి వైద్య శిబిరంలో 70 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. విశాఖకు చెందిన శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం మండలంలోని గిడుతూరు రామాలయం వద్ద ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. 70 మంది రోగులు హాజరయ్యారు. వీరికి కంటి వైద్య నిపుణుడు జాన్ పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. వీరిలో 26 మందికి ఆపరేషన్లు అవసరమని గుర్తించి విశాఖ తరలించారు. ఈ కార్యక్రమంలో చిటికెల ముచ్చిరామప్రసాద్, క్యాంపు కోఆర్డినేటర్ అరుణ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

పశువ్యాధులపై అప్రమత్తత అవసరం

మాకవరపాలెం: పశువ్యాధులపై పాడిరైతులు అప్రమత్తంగా ఉండాలని పశుసంవర్థకశాఖ డీడీ నర్సింహులు సూచించారు. స్థానిక పశువైద్య కేంద్రాన్ని ఆయన బుధవారం తనిఖీ చేశారు. రైతులకు రాయితీపై దానాతోపాటు పశుగ్రాస విత్తనాలను పంపిణీ చేస్తున్నామన్నారు. పశువులు ఆరోగ్యంగా ఉండేందుకు అవసరమైన టీకాలు, నివారణ మందులను అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి మణిదీప్ పాల్గొన్నారు.

స్కీం వర్కర్లకు పథకాలు వర్తింపజేయాలి

కె.కోటపాడు : ప్రభుత్వ శాఖల్లో పని చేస్తున్న స్కీం వర్కర్లకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను వర్తింపజేయాలని సీపీఎం మండల కార్యదర్శి రొంగలి ముత్యాలనాయుడు, యర్రా దేముడు కోరారు. వీరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందించలేని పక్షంలో, తక్షణం వీరిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఒక కుటుంబం బతకడానికి నెలకు రూ.26వేలు ఉండాలని, వాటిని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలనే ఆదేశాలను కోర్టు ఇచ్చిందని అన్నారు. అయితే స్కీం వర్కర్లకు ఇంత జీతాలను ఎక్కడా ఇవ్వడం లేదని ఆరోపించారు.

దొండపూడిలో అక్షరాభ్యాసాలు



విద్యార్థులతో అక్షరాభాస్యాలు చేయిస్తున్న ఉపాధ్యాయులు

రావికమతం : దొండపూడిలోని ఎంపీపీ స్కూల్లో కొత్తగా చేరిన 10 మంది విద్యార్థులకు బుధవారం సామూహిక అక్షరాభాస్యాలు చేయించారు. విద్యాకమిటీ చైర్మెన్ చందక చిన్నంనాయుడు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు బేగం, ఉపాధ్యాయులు ఫణీంద్ర, అప్పలనాయుడు, శ్రీను, రాజశేఖర్ పర్యవేక్షించారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లులు, అంగన్‌వాడీ కార్యకర్త దీప పాల్గొన్నారు.

డిప్యూటీ ఎంపీడీవోగా ప్రసాద్



దేవరాపల్లి: దేవరాపల్లి డిప్యూటీ ఎంపీడీవోగా ఎస్.కె.వి. ప్రసాద్ బాధ్యతలు స్వీకరించారు. కొయ్యూరు మండలం నుంచి బదిలీపై వచ్చిన ఆయన బుధవారం ఇక్కడ విధుల్లో చేరారు. మండలంలో సుమారు రెండేళ్లుగా ఈవోపీఆర్డీ పోస్టు ఖాళీ ఏర్పడింది. అప్పటి నుంచి ఇంచార్జిలతో నెట్టుకురాగా తాజాగా ప్రసాద్‌ను డిప్యూటీ ఎంపీడీవోగా నియమించారు. మండలంలోని అన్ని పంచాయితీలు కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లతో బుధవారం సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సచివాలయాల్లో సమయపాలన పాటించడంతో పాటు పౌర సేవలను పారదర్శకంగా అందించాలని ఆయన సూచించారు.

సోలార్ విద్యుత్‌పై నేడు అవగాహన కార్యక్రమం

గొలుగొండ : ఏఎల్‌పురం గ్రామంలో శుక్రవారం ఉదయం సోలార్ విద్యుత్‌పై విద్యుత్ వినియోగదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని గొలుగొండ విద్యుత్‌శాఖ ఏఈ కె. రాజేంద్రప్రసాద్ తెలిపారు. ప్రధానమంత్రి సూర్య ఘర్ అనే కార్యక్రమంలో బాగంగా విద్యుత్ వినియోగదార్లు అవగాహన కార్యక్రమంకు జిల్లా విద్యుత్ శాఖ ఎస్ఈ జి.ప్రసాద్, ఈఈ ఏపీఎస్ఎమ్ అప్పారావు, డిప్యూటీ డీఈఈ సునీల్‌కుమార్ హాజరవుతున్నట్టు చెప్పారు. వినియోగదారులు ఈ కార్యక్రమానికి హాజరుకావాలని కోరారు.

ఆర్ఐ బాబూరావు బాధ్యతల స్వీకారం

మాడుగుల రూరల్: మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గ(ఆర్ఐ)గా ఎస్.బాబూరావు తహసీల్దారు కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఆర్ఐగా పనిచేసిన నాగేశ్వరావు సాధారణ బదిలీలో భాగంగా బుచ్చెయ్యపేటకు వెళ్లారు. బాబూరావు గతంలో మండలంలో వీఆర్ఓగా పనిచేశారు. కాగా ఈయన అచ్యుతాపురం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కార్యాలయంలో ఎల్ఎఎస్ఎటీబీ నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చారు.

ఉద్యానవనశాఖాధికారి పుష్పలీలావతి బదిలీ

మాడుగుల రూరల్: మండల ఉద్యానవనశాఖాధికారి వి. భానుపుష్పలీలావతి భీమునిపట్నం బదిలీ అయ్యారు. ఈమె మాడుగుల మండలంతో పాటు రావికమతం ఉద్యానవనశాఖాధికారిగా ఇంతవరకు పనిచేసారు. కాగా ఈమె స్థానంలో ఎవరినీ నియమించలేదు. కాగా తన విధి నిర్వహణలో సహకరించిన వీఏఏలు, వీహెచ్ఏలు, రైతులకు అమె కృతజ్ఞతలు తెలిపారు.

మృతుని కుటుంబానికి ఆర్థికసాయం



ఒమ్మలిలో సూరిబాబు కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేస్తున్న దృశ్యం

మాడుగుల రూరల్ : కింతలి గాదిరాయి రూరల్ వాసవీ క్లబ్ సభ్యుడు అయిన ఒమ్మలి గ్రామానికి చెందిన పుట్టా పెద సూరిబాబు ఇటీవల మృతి చెందారు. ఈ ఏడాది అంతర్జాతీయ వాసవీ క్లబ్ అధ్యక్షుడు ఇరుకుల రామకృష్ణ నూతనంగా ప్రవేశపెట్టిన మహాప్రస్థానం పథకం ద్వారా సూరిబాబు కుటుంబానికి ఆర్థికసాయం అందించారు. వాసవీ అంతర్జాతీయ వైస్ ప్రెసిడెంట్ శ్రీనాధు శ్రీను స్వయంగా వెళ్లి రూ. 25వేలు బుధవారం ఒమ్మలిలో ఆ కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో జోన్ చైర్మన్ పుట్టా మాధవి, క్లబ్ ప్రెసిడెంట్ కె.గున్నయ్యశెట్టి, జంపెన వాసవీమాత ఆలయ కమిటీ చైర్మన్ అర్జునరావు పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్ల నియామకం

రావికమతం : కన్నంపేట, టి.అర్జాపురం-2, కె.కొట్నాబిల్లి పంచాయితీలకు నూతనంగా ఫీల్డ్ అసిస్టెంట్‌లుగా నియమితులైన వారికి చోడవరం ఎమ్మెల్యే రాజు బుధవారం నియామక ఉత్వర్వులు అందజేశారు. కన్నంపేట పంచాయితీకి సేనాపతి పద్మ, టి.అర్జాపురం -2 గ్రామానికి మచ్చా వెంకటలక్ష్మి, కె.కొట్నాబిల్లి గ్రామానికి అరిగేల ప్రసాద్‌లను నియమించారు. కార్యక్రమంలో ఎంపీడీవో వెంకన్నబాబు, ఏవో సీతారామస్వామి, ఏపీవో చిన్నారావు పాల్గొన్నారు.

కూటమి నేతలకు ప్రజలే గుణపాఠం చెబుతారు



పెదమదీనలో కూటమి అవినీతి పాలనను వివరిస్తున్న అచ్చింనాయుడు

బుచ్చెయ్యపేట : ఎన్నికల ముందు సూపర్ సిక్స్ పథకాలంటూ మోసం చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు ప్రజలు తగిన గుణపాఠం చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని మండల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొళ్లిమల్ల అచ్చింనాయుడు తెలిపారు. బుధవారం పెదమదీన గ్రామంలో జగన్ అంటే నమ్మకం, చంద్రబాబు అంటే మోసం.. కూటమి ప్రభుత్వ ఏడాది రాక్షస పాలనపై వైఎస్సార్‌సీపీ విడుదల చేసిన బుక్‌లెట్‌ను ఆయన ఆవిష్కరించారు. గద్దె నెక్కిన వెంటనే అమ్మ ఒడి, రైతు భరోసా పథకాలతో పాటు వలంటీర్ల జీతాలను రూ.10 వేలు పెంచి కొనసాగిస్తామని చెప్పిన కూటమి నేతలు ఒక్క హామీనీ అమలు చేయలేదన్నారు. రేషన్ బళ్లు తొలగించి ప్రజలకు నిత్యవసర వస్తువుల కష్టాలు తెచ్చారన్నారు. రైతు భరోసా, ఉచిత బస్సు ప్రయాణం, 18 ఏళ్లు నిండిన మహిళకు నెలకు రూ, 1,500, ఎస్సీ, ఎస్టీ, బీసీలకు 50 ఏళ్లకే పింఛన్ తదితర పథకాల ఊసేలేదన్నారు. బీఎన్ రోడ్డు, ఆర్టీ రోడ్డుతో పాటు పలు గ్రామాల్లో రోడ్లు దెబ్బతిన్నా గంపెడు మట్టి కప్పకుండా వాహనదారులు ప్రమాదాల బారిన పడేలా చేశారన్నారు. పెద్దేరు, తాచేరు వంతెనలు కూలిపోయినా కొత్త వంతెనల నిర్మాణంపై దృష్టి సారించకుండా ఎంపీ, ఎమ్మెల్యేలు కాలయాపన చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో లాయర్ చొప్పా బాబూరావు, వైఎస్సార్‌సీపీ నేతలు కొంత్యాన గోవింద, బోగాది సత్తిబాబు, వియ్యపు గోవింద, రమణ, గరికి శ్రీను, యర్రంశెట్టి ఈశ్వరరావు పాల్గొన్నారు.

జమీలు సేవలు చిరస్మరణీయం



జమీలు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే గణేష్, సూర్యనారాయణరాజు, జెడ్పీటీసీ

నాతవరం : రాజకీయ నాయకులు తన హయాంలో చేసిన మంచి పనులు ప్రజలు చిరకాలం చెప్పుకుంటారని మాజీ ఎమ్మెల్యే ఉమా శంకర్ గణేష్, మాజీ ఎమ్మెల్సీ డి.వి.సూర్యనారాయణరాజు అన్నారు. నాతవరం గ్రామంలో దివంగత నేత అంకంరెడ్డి జమీలు జయంతి సందర్భంగా బుధవారం ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దివంగత నేత జమీలు కాంగ్రెస్‌పార్టీలో వైఎస్సార్‌సీపీలో ఈ ప్రాంతానికి అనేక రకాలు సేవలు అందించారన్నారు. ఆయన ఆశయ సాధనకు జమీలు సైన్యం అంకిత భావంతో పని చేయాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు అప్పలనర్స, నాతవరం సర్పంచ్ గొలగాని రాణి, ఉప సర్పంచ్ అప్పలరాజు, నర్సీపట్నానికి చెందిన వైద్యులు లక్ష్మీకాంత్, ఎంపీపీ లక్ష్మణమూర్తి, వైస్ ఎంపీపీ సునీల్, మండల పార్టీ అధ్యక్షుడు లగుడు నాగేశ్వరరావు, సెంట్రల్‌బ్యాంకు మాజీ డైరెక్టరు అంకంరెడ్డి పార్వతి, గన్నవరం, పీకేగూడెం పీఏఎస్ మాజీ పర్సన్ ఇంచార్జిలు గొర్లె వరహాలబాబు, అచ్చెర్ల వరహాలబాబు, పార్టీ జిల్లా నాయకులు సాంబమూర్తి, సూరిబాబు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

మండల కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించిందని ప్రముఖ చిన్న పిల్లలు వైద్యులు పి.వి.లక్ష్మీకాంత్ అన్నారు. దివంగత వైఎస్సార్‌సీపీ నేత అంకంరెడ్డి జమీలు జయంతి సందర్భంగా నాతవరంలో నిర్వహించిన వైద్య శిబిరంలో 280 మంది రోగులకు పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

ఎం.అలమండలో ఘనంగా రాయాలయ వార్షికోత్సవం



రామాలయంలో పూజలు చేస్తున్న భక్తజనం

దేవరాపల్లి : ఎం.అలమండలో రాయాలయం ద్వితీయ వార్షికోత్సవం బుధవారం అంగర వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా గ్రామస్తులు సీతారాముల వారిని దర్శించుకొని అత్యంత భక్తి శ్రద్ధలతో పూజలు జరిపారు. వేద పండితుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. దీంతో గ్రామంలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. ఆలయ ఆవరణలో మధ్యాహ్నం అన్నసమారాధన జరిపారు. సాయంత్రం పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ దాడి జగస్, పోతల శంకరరావు, పోతల నాయుడు, రమణ పాల్గొన్నారు.

రేపు పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేత

మాడుగుల: విద్యుత్‌లైన్ మరమ్మతుల కారణంగా ఈ నెల 20వ తేదీన విద్యుత్ సరఫరా ఉండదని నర్సీపట్నం విద్యుత్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ అప్పారావు బుధవారం తెలిపారు. మండలంలో గల అన్ని గ్రామాలకు శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ నిలిపివేస్తామన్నారు.

నర్సీపట్నం : ఈ నెల 20న పెదబొడ్డేపల్లి సబ్‌స్టేషన్ పరిధిలోని విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ అప్పారావు తెలిపారు. శారదనగర్, బ్యాంక్ కాలనీ, నర్సీపట్నం మెయిన్‌రోడ్డు, శ్రీకన్య థియేటర్, వెలమ సంఘం భవన ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ నిలిపివేస్తామన్నారు.

రావికమతం మండలంలో నేడు...

రావికమతం : రావికమతం, కొత్తకోట విద్యుత్ ఉప కేంద్రాల పరిధిలో గురువారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఈఈ అప్పారావు చెప్పారు. పి.పొన్నవోలు, జి.చీడిపల్లి, మేడివాడ, అప్పలమ్మపాలెం, దిడ్డి, బాదనపాడు, దొండపూడి, మత్స్యవానిపాలెం, టి.అర్జాపురం, కిత్తంపేట, ఆర్.కొత్తూరు, చిలకవానిపాలెం, మర్రివలసలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా ఉండదన్నారు.

గ్రామాల్లో చెత్త తొలగింపు



గిడుతూరులో పొక్లెయిన్‌తో చెత్తను తొలగిస్తున్న దృశ్యం



మాకవరపాలెం కింది వీధిలో తొలగించిన చెత్త

సాక్షి ఎఫెక్ట్..

మాకవరపాలెం : అధికారులు గ్రామాల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించే పనులు చేపట్టారు. మండలంలోని వివిధ గ్రామాల్లో పేరుకుపోయిన చెత్తపై సాక్షిలో బుధవారం పారిశుధ్యం తూతూమంత్రం.. అనే శీర్షికతో ప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించారు. డిప్యూటీ ఎంపీడీవో సీతామహాలక్ష్మి ఆదేశాల మేరకు మాకవరపాలెం, గిడుతూరు, తదితర పంచాయతీల కార్యదర్శులు చెత్తను తొలగించే పనులు చేపట్టారు. అన్ని గ్రామాల్లోనూ ఎక్కడా చెత్త కుప్పలు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆమె కార్యదర్శులను ఆదేశించారు.